www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 20 ఆగస్టు 2023

ఆదర్శ పాఠశాలలో అటల్ టింకర్ ల్యాబ్ ఏర్పాటు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని ఆదర్శ పాఠశాలలో అటల్ టింకర్ టెస్ట్ ల్యాబ్ ఏర్పాటు చేశారని ప్రిన్సిపల్ నంద శ్యామలదేవి తెలిపారు. అటల్ టింకర్ ఫస్ట్ శాస్త్ర సాంకేతిక నిసితాకాశంలో భారతదేశ కీర్తిని ఇనుమడింప చేయాలని సత్సంకల్పనతో ఆటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థుల మనోబుద్ధి వికాసాలతో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు శాస్త్ర వికసింపజేయడంలో ఇది ఎంతగానో దోహదపడుతుందని ఆమె అన్నారు. ల్యాబ్ ఇన్‌ఛార్జి ఓబుల్ రెడ్డి పర్యవేక్షణలో కార్యరూపం దాల్చుతూ ఎన్నో ప్రాజెక్టుల రూపకల్పనకు బాగా కృషి చేస్తుండడం విద్యార్థుల అదృష్టం అన్నారు. ఈనెల 17, 18, 19 తేదీలలో మూడు రోజులు పాటు అటల్ టింకర్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ లంసాల నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ న్యాయ నిర్ణేతలుగా హాజరై విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సర్పంచు, వార్డు ఎన్నికల్లో

వైసిపి, టిడిపి మద్దతుదారుల విజయం

రాయచోటి : విజయం సాధించిన టిడిపి మద్దతుదారుడు

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని శిబ్యాల గ్రామ పంచాయతీ 12వ వార్డుకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో పసుపు జెండా ఎగిరింది. ఈ సందర్భంగా 12వ వార్డుకు టిడిపి మద్దతు దారుడుగా పోటీ చేసిన ఆసాది ఆదెయ్య 11 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వార్డులోని 309 ఓట్లకు గాను 252 పోలయ్యాయి. అందులో పురుషులు 130, స్త్రీలు 122 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్ పూర్తి అయ్యేసరికి ఆదెయ్యకు 129 ఓట్లు రాగా, వైసిపి మద్దతుదారుడు పురం హరినాధకు 118 ఓట్లు వచ్చాయి. ఎన్నికలు ప్రారంభమైనప్పుడు నుంచి టిడిపి తరపున అభ్యర్థిచే నామినేషన్ వేయించడంతో పాటు శిబ్యాల గ్రామపంచాయతీలో జరుగుతున్న అరాచకాల గురించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. టిడిపి మద్దతుదారుడు ఆసాది ఆదెయ్య విజయానికి మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లె రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని టిడిపి నాయకులంతా సమిష్టిగా కృషి చేశారు. గొర్లముదివేడు గ్రామపంచాయతీలోని మూడవ వార్డుకు జరిగిన ఎన్నికల్లో 242 ఓట్లుగాను 200 ఓట్లు పోలయ్యాయి. అందులో టిడిపి మద్దతుదారులు గులాబ్ జాన్‌కు 82 ఓట్లు రాగా వైసిపి మద్దతుదారులు బాలనాగన్న గారి లక్ష్మీదేవికి 118 ఓట్లు వచ్చాయి. దీంతో వైసీపీ మద్దతుదారులు లక్ష్మీదేవి 36 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా శిబ్యాలలో అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.ఎం.డి.రఫీ, వీరబల్లి ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు గొర్లముదివేడులో రాయచోటి రూరల్ సిఐ తులసిరామ్, ఎస్ఐలు నరసింహారెడ్డి, ఇనాయతుల్లా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సిబ్యాల గ్రామంలోని 12వ వార్డు అభ్యర్థిగా ఆసాది ఆదెయ్య విజయం సాధించడంతో మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లె రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నేతలు, కార్యకర్తలు స్వీట్స్ పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మురికి నాటి వెంకటసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ విజయ మోహన్ రాజు, పెమ్మడపల్లి సర్పంచ్ పల్లపు వాసు, మాజీ సర్పంచ్ బసయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జయరామరాజు, టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్ నాయుడు, శిబ్యాల గ్రామ నాయకులు గంగిరెడ్డి, భాస్కర్,నరసింహులు, రంగారెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు ఎన్నికల్లో వైసిపి, టిడిపి విజయం

మండలంలోని శిబ్యాల, గొర్ల ముదెడులో శనివారం నిర్వహించిన వార్డు ఎన్నికల్లో టిడిపి, వైపిసి అభ్యర్థులు విజయం సాధించారు. శిబ్యాలలో టిడిపి, గొర్ల ముదిడులో వైసిపి అభ్యర్థులు గెలుపొందారు. శిబ్యాల గ్రామం 12వ వార్డుకు చెందిన వైసిపి అభ్యర్థి పురం హరినాథపై టిడిపి అభ్యర్థి ఆదేయ్య 11 ఓట్లు మెజారిటీ గెలుపొందారు. గొర్లముదేడు పంచాయతీలోని రెండవ వార్డుకు చెందిన టిడిపి అభ్యర్థి గులాబ్ జాన్‌పై వైసిపి మద్దతు దారుడు బాల నాగన్నగారి లక్ష్మీదేవి 36 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా సిఐలు సుధాకర్ రెడ్డి, తులసి రామ్, ఎస్ఐలు నరసింహారెడ్డి, మహమ్మద్ రఫీ, పోలీస్ సిబ్బంది బందోబస్తును ఏర్పాటు చేశారు.

నందలూరు: మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 2 పంచా యతీ వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లేబాకు గ్రామంలో 3వ వార్డులో నాగివెంకట సుబ్బయ్య టిడిపి మద్దతుతో ఏకగ్రీవ విజయం సాధించారు. పాటూరు గ్రామంలో 1వ వార్డులో పసుపులేటి సౌజన్య స్వతంత్ర అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రిటర్నింగ్ అధికారి, ఎంపిడిఓ సౌభాగ్యమ్మ చేతుల మీదుగా ధ్రువపత్రాన్ని అందుకున్నారు. పాటూరు పదో వార్డుకు ఎవరు పోటీ చేయకపోవడంతో ఎన్నిక జరగలేదు.

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లి సర్పంచ్ పరిధిలోని రెండో వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి మద్దతుదారు షేక్ మాబున్నిసా సమీప ప్రత్యర్థి సయ్యద్ ముక్తార్ అహ్మద్‌పై 49 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి చక్రే నాయక్ తెలిపారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉప ఎన్నికలల్లో మొత్తం 310 కాగా, అందులో 134 ఓట్లు మహిళలు, 108 ఓట్లు పురుషులు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. మధ్యాహ్నం 1 గంటకు పోలింగ్ ముగియగ, 2 గంటల నుంచి ప్రారంభమైన కౌంటింగ్‌లో వైసిపి మద్దతుదారు మాబున్నిసా టిడిపి మద్దతుదారు సయ్యద్ ముక్తార్ అహ్మద్‌పై 49 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. వైసిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహం వెల్లివిరిసింది. తనను ఇంత భారీ మెజార్టీతో గెలిపించిన రెండో వార్డ్ ఓటర్లకు, మహిళలకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. రాయచోటి డిఎస్‌పి మహబూబ్ బాషా తన సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చొరవ చూపి వార్డు ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూసారు. వైసీపీ కార్యకర్తలు స్థానిక మూడు రోడ్ల కూడలి నుండి భాణసంచా పేలుస్తూ ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో పలువురు ఎంపి టిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న బాబున్నీసా

ష..గప్‌చిప్!

గోప్యంగా స్టాఫ్‌నర్స్‌ల రిక్రూట్‌మెంట్

118 పోస్టుల భర్తీలో నిబంధనలు గాలికి

నోటీస్‌బోర్డుకు చేరని ఖాళీల జాబితా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైద్యో ఆరోగ్య శాఖ రీజినల్ కార్యాలయంలో నిశ్శబ్ధం రాజ్యమేలుతోంది. ప్రభుత్వం వైద్య సేవలను మెరు గుపరచడంలో భాగంగా గతేడాది ఆగస్టులో కాంట్రాక్టు పద్ధతిన నర్సింగ్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. స్టాఫ్‌నర్స్ మొదలుకుని ఎంపిహెచ్‌ఒలు ఎంఎల్‌హెచ్‌పి తదితర పోస్టులు ఉన్నట్లు సమాచారం. వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ రీజినల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో దశల వారీగా నర్సింగ్ పోస్టులను భర్తీ చేసుకుంటూ వస్తోంది. గత నెల 21, 22 తేదీల్లో 313 స్టాఫ్‌నర్స్ పోస్టులను రిక్రూట్‌మెంట్ చేసింది. ఎంపికైన కొం దరు సరైన పోస్టింగ్ లభించక, ఇతర అనివార్య కారణాల రీత్యా విధులకు హాజరు కాలేకపోయిన ఖాళీలతో కలిపి తాజాగా 118 స్టాఫ్‌నర్స్ పోస్టుల రిక్రూట్‌మెంట్ ప్రక్రియను చేపట్టింది. రోస్టర్ ప్రకారం 15 రోజులు ముందు ఉద్యోగ నియామమకాల వివరాలను నోటీస్‌బోర్డు ద్వారా వెల్లడించాల్సి ఉంది. అనంతరం కౌన్సెలింగ్ తేదీని వెల్లడించాలి. ఆర్‌డి కార్యాలయ యంత్రాంగం ఇటువంటి నిబంధనలను గాలికి వదిలేసింది. ఇటువంటి నిబంధనల్లో అభ్యంతరాలు ఏమైనా ఉంటే వెల్లడించాలని కోరాల్సి ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి వాటిని సాధారణ నిబంధనల్ని విస్మరించి నచ్చిన వారిని వాట్సప్, మెస్సేజ్‌లు, ఫోన్‌ల రూపాల ద్వారా పిలుచుకుని ఇష్టారీతిన రిక్రూట్‌మెంట్ చేస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున ఉన్నాయి. 20 రోజుల కింద ఆన్‌లైన్ ద్వారా 22 నుంచి 26 ఖాళీలను భర్తీ చేసినట్లు సమాచారం. ఏ విధానంలో నియామకాలు చేపట్టినప్పటికి నిబంధనలు పాటిం చకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఆర్‌డి కార్యాలయం అందించే సమాచారం సాంకేతిక అవాంతరాల వల్ల ఆలస్యంగా అందితే ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుంచి సకాలంలో కౌన్సెలింగ్ హాజరు కావడం అసాధ్యం. ఇటువంటి పరిస్థితుల్లో అర్హులైన వారికి అన్యాయం జరిగే అవకాశం ఉంటుందని ఆందోళన నెలకొంది. ఆర్‌డి కార్యాలయం రిక్రూట్‌మెంట్ వ్యవహారాల్లో నిబంధనల్ని గాలికి వదిలేయడం పరిపాటిగా మారింది. ఇటువంటి ఉద్దే శపూర్వక నిర్లక్ష్యం వెనుక మతలబేమిటో తెలి యడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీ వంటి ఉన్న తాధికారులు జోక్యం చేసుకుని రిక్రూట్‌మెంట్ వ్యవహారంలో నిబంధనలు అమలు చేసి నియామకాల్లో పారదర్శకతను పాటించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి

రైతు సంక్షేమమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన సంబేపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ రైతుభరోసా కేంద్రం నూతన భవన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీ.శే. ముఖ్యమంత్రి వైఎస్ఆర్ రైతు సంక్షేమానికి కృషి చేసి రైతు పక్షపాతిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. ఆయన తనయుడు సీఎం జగన్ అదే బాటలో నడుస్తూ రైతుల సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తున్నారన్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాలును ఏర్పాటు చేశారని, అవి రైతులకు విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగ పడుతున్నాయని చెప్పారు. ప్రతి పంటనూ రైతులు ఈ క్రాపింగ్ చేయించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులు పండించిన పంటలును ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించిందన్నారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు చాలా చక్కగా ఉపయోగ పడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీ లక్ష్మి, జడ్పిటిసి సర్పంచుల సంఘం అధ్యక్షులు చిదంబ రెడ్డి, మండల నాయకులు రమేష్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో కలిసి ఆర్‌బికెను ప్రారంభిస్తున్న ఎంపిపి నాగశ్రీలక్ష్మి

దోమల వల్లే మలేరియా : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దోమల వల్లే మలేరియా వ్యాప్తి చెందుతుందని డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య అన్నారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివ నర్సింగ్ కళాశాలలో దోమలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగష్టు 20న ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు. 1897 ఆగస్ట్20వ తేదీన సర్ రోనాల్డ్ రాస్ అనే ఒక బ్రిటీష్ డాక్టర్ మలేరియా జ్వరాన్ని కలుగ చేసే ప్లాస్మోడియం పరాన్న జీవులు ఆడ ఏనాపిలుస్ దోమల లో ఉన్నాయని గుర్తించి,మలేరియా జ్వరాల వ్యాపి కి కారణం ఆడ ఏనాపిలుస్ ధోమలేనని దీన్ని మన దేశం లోని తెలంగాణ రాష్ట్రం అయినా సికింద్రాబాద్ నుండి ప్రపంచానికి చాటి చెప్పారని అందుకనే నేడు ప్రతీ సంవత్సరం ఆగస్ట్ 20ని ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపుకుంటున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు 1902 లో సర్ రోనాల్డ్ రాస్ కు నోబెల్ బహుమతి ఇచ్చారని అన్నారు. వైద్య శాస్త్రం లో సర్ రోనాల్డ్ రాష్ సేవలు చిరస్మరణీయంగా ఉండిపోతాయని అన్నారు.విద్యార్థులు చేత ప్రతిజ్ఞను ఆరోగ్య వైద్యాధికారి మహమ్మద్ రఫీ చేయించారు. విద్యార్థులు నినాదాలు చేస్తూ బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రపంచ దోమల దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, డిప్యూటీ డి యం వో దేవశిరోమని, సబ్ యూనిట్ అధికారి మూజీబ్, ఎల్.టి.శివ ,డి.ఎమ్. హెచ్.ఓ కార్యాలయ సిబ్బందితో పాటు ప్రధానోపాధ్యాయులు జానకి,ఆజినేయులు,నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ భాస్కర, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న డిఎంహెచ్‌ఒ

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

యానిమేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి- కలకడ

ప్రభుత్వం యానిమేటర్లకు మూడేళ్లకు వరకే ఉద్యోగం ఉండేలా విడుదల చేసిన కాలపరిమితి సర్క్యులర్ 64ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయ ఆవరణలో జరిగిన యానిమేటర్ల మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక ప్రగతికి తోడ్పడే 28 వేల మంది యానిమేటర్ల కుటుంబాలు ప్రభుత్వ అనాలోచనతో వదిలిన 64వ సర్క్యులర్‌తో రోడ్డున పడతారని పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచించుకొని మూడేళ్ల కాలపరిమితి రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చే 8 వేల జీతంలో ప్రభుత్వ యాప్‌లకు, రవాణా ఖర్చులకు 3 వేలు ఖర్చు పోగా, కేవలం రూ.5 వేలతో కుటుంబాలు నెగ్గుకు రావాలంటే చాలా ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. జీతాలు రాక, చేసిన అప్పులతో వ్యధకు గురై పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, పెరిగిన ధరలతో తీవ్ర ఇక్కట్లతో మానసిక ఆందోళనల నుండి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యానిమేటర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రెడ్డెప్ప, ఉపాధ్యక్షులు కృష్ణమ్మ మాట్లాడుతూ ధరలకనుగుణంగా కనీసవేతనం రూ.21 వేలు ఇవ్వాలని, సిబిఓ హెచ్‌ఆర్ అమలు చేసి, సంఘాల మెర్జింగ్ ఆపాలని, పది లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని లేని ఎడల రాష్ట్ర వ్యాపితంగా నిరవధిక సమ్మెకైనా సిద్ధమని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో గ్రూపులు తక్కువ ఉన్నాయనే నెపంతో విధుల నుండి తప్పించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. కార్యక్రమంలో యానిమేటర్లు వెలుగు రెడ్డప్ప కన్యాకుమారి, చెన్నమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రాయచోటి: దేవపట్ల గ్రామం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో బోరు వేసి మోటార్ బిగించి శాశ్వత నీటి వసతి కల్పించామని ఎపిఎస్‌డబ్ల్యుఆర్ ఇఐ సొసైటీ జిల్లా కో- ఆర్డినేటర్ వి.డి.సుకన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సమస్య, భోజనం, పారిశుధ్యం అంశాలపై గతంలో గురుకులాన్ని ఆకస్మికంగా చేశామన్నారు. గురుకులంలో గ్రౌండ్ లెవల్‌లో నీళతక్కువగా ఉన్నందున రోజుకు 5 ఐదు ట్యాంకర్ల నీటిని గురుకులానికి తోడామని చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం బోరును వేసి మోటారును బిగించడంతో నీటి సమస్య తీరిందన్నారు. విద్యార్థులకు భోజనంలో పురుగులు వస్తున్నాయని ఫిర్యాదులు, వార్తలు రావడంతో బియ్యాన్ని మార్చామని చెప్పారు. పాఠశాల ఆవరణను శుభ్రంగా ఉంచడానికి శానిటేషన్ సూపర్ వైజరును, శానిటేషన్ వర్కర్లను గట్టిగా మందలించి తగు సూచనలు ఇచ్చామని పేర్కొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం మదనపల్లె మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపిడిఓ భాను ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మండలం పరిధిలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయా శాఖల అధికారులు సమగ్రంగా వివరించారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, నాడు-నేడు, జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని ఎంఇఓ-2 రాజగోపాల్ తెలిపారు. విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు నిర్మాణం స్మార్ట్ టివి, లైట్లు ఫ్యాన్లు అందుబాటులోకి తీసుకు రావడంతోపాటు 89 మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకోవడానికి అవకాశం కల్పించడం జరిగిందని చెప్పారు. మదనపల్లె మండలంలో పేదలందరికీ జగనన్న ఇండ్లు కార్యక్రమంలో 4852 ఇండ్లు మంజూరు కాగా, అందులో ఇంకా 500 ఇండ్లు ప్రారంభం కావాల్సి ఉందని, పునాదుల్లో 1744 ఇండ్లు, 550 ఇండ్లు గోడలు,1744 ఇండ్లు పూర్తి కావడం జరిగిందని వివరించారు. టాయిలెట్స్ నిర్మాణానికి 12 వేల రూపాయలు,మురుగు నీరు వాటర్ రోడ్లపైకి రాకుండ ఉండటానికి సోప్ పిట్ నిర్మాణానికిగాను రూ.6 వేలు ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. 29 లేఅవుట్లలో ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ లబ్ధిదారులు అందరూ నవంబర్ నెలాఖరుకు ఇండ్లు నిర్మాణం పూర్తి చేసుకోనేలా పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారి నాగప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షభావ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో సాగు 20 శాతం మాత్రమే జరిగిందని, ప్రత్యామ్నాయంగా 80 శాతం రాయితీతో ఉలవలు రైతులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు .జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం కింద 1436 మందికి డాక్యుమెంట్స్ పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తహసిల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. మదనపల్లె మండలంలో నవరత్నాలు సంక్షేమ పథకాలలో భాగంగా 7330 మందికి పెన్షన్లు పంపిణి చేయడం జరుగుతోందని ఎంపిడిఓ భాను ప్రసాద్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నవాజ్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఇప్పటికే 98 శాతం అమలు చేసిందన్నారు. మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని పథకాలపైన ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిపి ఎర్రబల్లి రెడ్డెమ్మ, వైస్ ఎంపిపిలు రమణ, నందిని, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులు రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వెంకటరమణ, సింగిల్ విండో చైర్మన్ దండు కృష్ణారెడ్డి, ఆర్‌బికె చైర్మన్ కత్తి రాజు మండల తహశీల్దార్ మహబుబ్ చాంద్ ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పరుగు పందెం పోటీకి ఎంపికైన సిద్ధార్థ

ప్రజాశక్తి-పీలేరు

ఇంటి పేరు 'గుర్రం' పరుగులో 'వేగం' అదే పీలేరు కుర్రాడు గుర్రం సిద్ధార్థ 'తేజం'. పీలేరు మండలంలోని దొడ్డిపల్లి పంచాయతీకి చెందిన గుర్రం నారాయణ కుమారుడు గుర్రం సిద్ధార్థ పరుగు పందెంలో తన సత్తా చాటుతూ ఇంటి పేరును సార్థకం చేసుకుంటున్నాడు. మదనపల్లి జవహర్ నవోదయా విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దక్షిణ భారత స్థాయిలో ఇటీవల నవోదయ విద్యాలయ సమితి జరిపిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీల్లో గుర్రం సిద్ధార్థ పాల్గొని 100, 200 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈనెల 24 నుండి 26 వరకు గుజరాత్ రాష్ట్రం, నడియాడ్ లో జరిగే జాతీయస్థాయి పరుగు పందేనికి సిద్ధమౌతున్నాడు. ఈ సందరేగా గుర్రం సిద్ధార్థ మాట్లాడుతూ పరుగు పందెంలో తాను రాణించడానికి తన వ్యాయామ ఉపాధ్యాయులు జి. సురేంద్ర రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహమే మొదటి కారణమని అంటున్నాడు. ఆయన శిక్షణలోనే తాను జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. తన ఇంటిపేరు "గుర్రం" కావడంతో పరుగు పందెంలోనూ 'రేసుగుర్రం' లాగా దూసుకుపోతూ తన ఇంటి పేరును నిలబెట్టుకుంటున్నాడని సిద్ధార్థ తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. తండ్రి గుర్రం నారాయణ గత 25 సంవత్సరాల నుండి దళిత ఉద్యమ నేతగా, సామాజిక కార్యకర్తగా, తల్లి వనజాక్షి ప్రథమ చికిత్స కేంద్రం నిర్వహిస్తున్నారు.

గురువుతో పరుగు పందెం పోటీలకు ఎంపికైన సిద్ధార్థ

పిడికిలి

ప్రజాదృష్టి

కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా ప్రజానీకం మరోసారి ఉక్కు పిడికిలి బిగించింది. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ ఆధ్వర్యంలో మరోసారి ఉక్కుకేక పొలికేక పెట్టింది. 2024 సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మరోసారి అజెండాగా మారే అవకాశాలు పుష్కలముగా కనిపిస్తున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే మూడేళ్లలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి ప్రారంభోత్సవం చేస్తామని ఇచ్చిన హామీ నీరోడుతోంది. కడప జిల్లా వాసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కానున్న నేపథ్యంలో ప్రజానీకం ఆశలు పెంచుకుంది. ఆచరణలో పరిశీలిస్తే ఇచ్చిన హామీ ఆమడ దూరంలో నిలిచిన నేపథ్యంలో మరోసారి అజెండా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేర్చాలని కోరుతూ తలపెట్టిన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉరుముతోంది. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమకు కావాల్సిన ముడిసరుకులు ఐరన్‌ఓర్, డోలమైట్ తదితర కీలక ముడిసరుకు అందుబాటులో ఉన్నప్పటికీ ఏర్పాటుకు నోచుకోకపోవడం గమనార్హం. దేశంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసిన ప్రాంతాలను పరిశీలిస్తే ఇటువంటి సదుపాయాలు, అనుకూలతలు లేని చోట ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం, లాభదాయకం కావడాన్ని గమనిస్తే అన్ని అనుకూలతలు ఉన్న కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడానికి కేంద్రంలోని బిజెపి సర్కారు పాజిబిలిటీ పేరుతో మీనమేషాలు లెక్కిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది, రాజకీయ లాభనష్టాలు భేరీజు వేసుకుని కేంద్రంలోని బిజెపి సర్కారు ముందుకు వెళ్తున్న సంగతి అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో బిజెపికి పునాది లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌ను నిర్లక్ష్యం వహిస్తోందనే వాదన వినిపిస్తోంది. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడిగా కేంద్రంపై దండెత్తడంలో విఫలమవడం వల్లే రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని చెప్పవచ్చు. కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టే బిల్లులకు రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి పోటీపడి మద్దతు ప్రకటించడం విస్మయాన్ని కలిగిస్తోంది. పొరుగు రాష్ట్రమైన తమిళ నాడులో జల్లికట్టు మొదలుకుని నీట్ అమలు విషయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసికట్టుగా పోరాడి సాధించుకోవడాన్ని గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి ఉమ్మడి పోరాటాన్ని విస్మరించి అధికార, ప్రతిపక్ష పార్టీలు బద్ధశుత్రవులుగా మారి పరస్పరం అనుచిత పదజాలంతో దూషించుకునే స్థితికి దిగజారిన రాజకీయాలు చేయడం విడ్డూరం, ఇటువంటి రాజకీయ వాతావరణాన్ని ప్రజానీకం తీవ్రంగా గర్హించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోని ధనవంతమైన ప్రాంతమైన గాజువాక తర హాలో అభివృద్ధి చెందడం తథ్యమనే అంచనాలు ఉన్నాయి. ఇటువంటి అభివృద్ధి చోధక రాజకీయాలను విస్మరించి, ప్రత్యక్ష, భౌతిక దాడుల దశకు చేరుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇందులో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, రెండింటి మధ్య మరో పాత్ర పోషి స్తున్న జనసేన తాన అంటే తందానా అనే రాజకీయం చేయడం జుగుప్సా కరమని చెప్పుకోవాలి. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో సాగుతున్న ప్రజాసమస్యలను ఇతివృత్తంగా చేసు కుని రాజకీయాలు నడపాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు. లేనిపక్షంలో పాలక, ప్రతిపక్ష పార్టీల నాయకత్వాలను భవిష్యత్ తరాలు క్షమించబోవనే సంగతిని గుర్తు పెట్టుకోవాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత,కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.ఆర్.మధురవాణి, రాజేశ్వరి తెలిపారు. శనివారం మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరిగాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చెయ్యాలన్నారు.వేతనంతో కూడిన మెడికల్ లీవ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 ఏళ్లకు పెంచాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలిలన్నారు. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు వాణి, విజయ, ప్రభావతి పాల్గొన్నారు.

బాలును సన్మానిస్తున్న ఎబిఎపి నాయకులు

బాలు గురుస్వామికి సన్మానం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు మండల అయ్యప్ప స్వాముల గురుస్వామి ఏనుగుల బాలాంజనేయులు (బాలు) గురుస్వామిని శిష్యబృందం ఘనంగా సన్మానించింది. స్థానిక అన్నమాచార్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయిన ఆయనను స్థానిక అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, నందలూరు శాఖ అధ్యక్షుడు ముమ్మడిశెట్టి సుధాకర్, జిల్లా సభ్యుడు రాచూరి మురళి ఆధ్వర్యంలో సన్మానకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమ్మెట శివప్రసాద్ మాట్లాడుతూ ఎబిఎపి ఆధ్వర్యంలో 16 సంవత్సరాలుగా పంబా ఎరిమేలిలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదని. మన మండలవాసి బాలాంజనేయులు గురుస్వామి రెండవ సారి ఎబిఎపి జాతీయ ప్రధాన కార్యదర్శి కావడం చాల గర్వకారణమన్నారు. బాలాంజనేయులు గురుస్వామి మాట్లాడుతూ గత ఆది వారం విశాఖపట్టణంలోని శంకర మఠంలో నిర్వహించిన జాతీయ సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నికలలో 5 రాష్ట్రాల ప్రతినిధులు 250 మందికి పైగా పాల్గొనటం జరిగిందని ఈ ఎన్నికలలో వారందరు ముక్త ఖంఠంతో ఏకగ్రీవంగా ప్రతిపాదించి ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. అయ్యప్పస్వామి వారి సేవలో తరించడం, అయ్యప్ప ధర్మాన్ని ప్రచారంచేయడం అనుసరించడం తనభాద్యతన్నారు. నందలూరు నుండి యువత ఎబిఎపిలో ఒకభాగమై అన్నదాన కార్యక్రమాలు, సేవ కార్యక్రమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎబిఎపి జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట శివశంకర్, కిరణ్, వేణు, పత్తి, పరంధామ, రాము, సురేష్, రమేష్, కనకయ్య, భార్గవ్, వినయ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిర్వాహకులు

రేపటి నుంచి ఫుట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 21 నుంచి శానిటోరియంలో డాక్టర్ కెటి జెసూడియన్, అలెక్జాండర్ జిపి అలెగ్జాండర్ మెమోరియల్ సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. శనివారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఆంధ్రప్రదేశ్ నుంచే కాకుండా కర్ణాటక కేరళ తమిళనాడు తెలంగాణ రాష్ట్రాల నుంచి పదహారు జట్లు పాల్గొంటాయన్నారు. ఈ నెల 21 నుంచి మ్యాచ్‌లు ప్రారంభమై 27 ఫైనల్ ఉంటుందన్నారు. అన్ని టీములకూ నాకౌట్ జరుగుతుందన్నారు. ఎనిమిది మ్యాచ్‌లలో గెలిచిన జట్లకు లీగ్ మ్యాచ్‌లు ఉంటాయని లీగ్ మ్యాచ్‌లో గెలిచిన టీములకు సెమీస్ నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఫైనల్ మ్యాచ్ ఉంటుందన్నారు. ఈ మ్యాచ్ లో విన్నర్స్‌కి లక్ష రన్నర్స్‌కి యాభై వేలు తృతీయ బహుమతి ఇరవై ఐదు వేలతో పాటూ వ్యక్తిగత బహుమతులు ఉంటాయన్నారు. ఈ క్రీడలకు ఆరోగ్యవరం ఫుట్‌బాల్ లవర్స్ జిపి అలెగ్జాండర్ ఫ్యామిలీ నిర్వాహకులుగా ఉంటారు. క్రీడలకు కావాల్సిన సదుపాయాలు గ్రౌండ్ సౌకర్యం ఎఎంసి వారు కల్పిస్తున్నారని తెలిపారు.

ఓటర్లను ప్రలోభ పెట్టారు : టిడిపి

లక్కిరెడ్డిపల్లి: ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి, బెదిరించి ఓట్లు వేయించుకున్న గెలుపు గెలుపేనా అని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారం ఆర్‌ఆర్ స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు, యానిమేటర్లు, రేషన్ డీలర్లు ఇంటింటి ప్రచారం చేసి ఎసిపికి ఓట్లు వేయకపోతే పథకాలు పెన్షన్లు నిలిపివేస్తామని ఓటర్లను బెదిరించి ప్రలోభాలకు గురి చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు తెలిపినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అసలు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటింటికి వెళ్లి పథకాలు నిలబెడతామని రెండు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామని ఓటర్లకు ఆశలు కల్పించి ఓట్లు వేయించుకున్నారని ఇలాంటి గెలుపులు గెలుపేనా అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజలకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు చెంద్రాయుడు, గంగయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, అప్పరెడ్డి, ముక్తార్‌అహ్మద్, మంజూర్, గంగయ్య, నవాజ్, అన్వర్, మన్సూర్ పాల్గొన్నారు


మాట్లాడుతున్న టిడిపి నాయకులు ప్రభాకరరెడ్డి

జిఒ 117ను రద్దు చేయాలి : ఫ్యాప్టో

డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

జిఒ 117ను వెంటనే రద్దు చేయాలని జిల్లా ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ రాయచోటి రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఫ్యాప్టో నాయకులు ఉపాధ్యాయ సమస్యలపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో మూసివేతకు గొడ్డలి పెట్టి లాంటి 117 జిఒను రద్దు చేయాలన్నారు. ఈ జిఒ వలన మూడో తరగతి నుంచి పదవ తరగతి వరకు పాఠశాలలను మేర్జి చేయడం వల్ల మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఎలిమెంటరీ స్కూల్‌లన్నీ మూతపడ్డాయని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులు ఉంటే ఒక్కొక్క తరగతికి ఒక ఉపాధ్యాయుని ఇస్తామని చెప్పి మెర్జి చేయడం వల్ల ఉపాధ్యాయులను ఇచ్చామని చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ప్రాథమిక విద్య ఎంత పటిష్టంగా ఉంటే విద్యార్థుల ఉన్నతి అంతా అభ్యుదయంగా జరుగుతుంది కానీ నేడు ప్రాథమిక విద్యను నాశనము చేసే మనస్తత్వంతో కూల్చివేతకు సిద్ధమై ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ముఖ్యంగా కనపడు తోందన్నారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు ప్రాథమిక స్థాయిలో బోధించడానికి ఓన్లీ స్కూల్ సెకండ్ గ్రేడ్ టీచర్లను మాత్రమే ఉపయోగించాలన్నారు. నేడు ఆ పరిస్థితి లేదు ప్రాథమిక విద్యను పునరుద్ధించాలంటే కచ్చితంగా ప్రాథమిక పాఠశాలలో ప్రతి క్లాస్కు ఒక ఉపాధ్యాయుడి నుంచి విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసి గట్టి పునాదులు వేస్తే వారు భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. ప్రతి ఒక ప్రాథమిక పాఠశాలకు మహిళ టీచర్లను ముఖ్యంగా వాళ్ళ చక్కగా ఆ విద్యార్థులను దగ్గరకు తీసుకుని వారి భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. గతంలో ఒక కిలోమీటర్ పరిధిలోని పాఠశాలలు విరివిగా ఉన్నామయన్నారు. ఆ పాఠశాలకు ఈరోజు ముస్తాబు చేసి వాటిని బూజుపట్టే విధంగా చేశారన్నారు. నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలలు ముస్తాబు చేసి ఉపాధ్యాయులను ఇవ్వకుండా పాఠశాల మూతపడే విధంగా ఈ జిఒ117 గొడ్డలిపెట్టాలాగా పనిచేసిందన్నారు. ప్రాథమిక పాఠశాలను నిర్వీర్యం చేసే జిఒను వెంటనే రద్దుచేసి ఉపాధ్యాయులను కాపాడాలిన్నారు. సిపిఎస్ రద్దును చేయాలని డిమాండ్ చేశారు. వర్క్అడ్జస్ట్మెంట్ ఉత్తర్వులను వెంటనే నిలిపివేయాలిన్నారు. ఈ నెల 23వ తేదీన విజయవాడలో జరుగు సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా జాయింట్ సెక్రెటరీ అబ్బవరం హరిబాబు, ఉపాధ్యాయులు ఆదినారాయణ రెడ్డి, శివారెడ్డి, మురళి కుమార్, రవీంద్రనాథ్ రెడ్డి, రామకృష్ణ, అజిదుర్ రహ్మాన్, మురళి కుమార్ శంకర్ రెడ్డి, జయన్న పాల్గొన్నారు

ప్రజా సంక్షేమానికి పెద్దపీట : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక సంత గేటు వీధి, ఆర్టీసీ నల్లగుట్టలోని పలు వీధుల్లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రజల ద్వారా స్థానిక సమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల నిర్వహణలో ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, ఆటంకాలను సృష్టించినా ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమం కోసం వాటిని ఎదుర్కొంటూ ముందుకు పోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా, అమ్మఒడి, రైతు భరోసా, విద్యా, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ, సామాజిక పెన్షన్లు వంటి కార్యక్రమాల అమలుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా, రాకుండా క్యాలెండర్ ప్రకారం వాటిని అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలు కొనసాగాలన్నా, ఆశించిన మేరకు రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా 2024 ఎన్నికల్లో మనం తిరిగి వైఎస్సార్ పార్టీని గెలిపించుకోవాలని, జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్ రెడ్డి, జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వైసిపి యువ నాయకులు జివి రాకేష్ రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి హుమయూన్, వైస్ ఎంపీపీలు హరితా వెంకటరమణ, నెల్లూరు వెంకటాచలపతి, జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ షాకీర్ బాష, జిల్లా మహిళా అధ్యక్షురాలు మహితా ఆనంద్, ఖాదర్ బాష, ఉదయ్, అతిక షఫీ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఎల్‌పిజి వినియోగంలో మెలకువలు తప్పనిసరి

వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ప్రసాద్‌నాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళలు ఎల్‌పిజి వినియోగంలో మెలుకవలు పాటిస్తే ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ ప్రసాద్ నాయుడు సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలోని రైల్వేస్టేషన్ పై ఓవర్ బ్రిడ్జి కింద హెచ్‌పిగ్యాస్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎల్‌పిజిని వాడేటప్పుడు కచ్చితంగా తీసుకోవలసిన వివిధ జాగ్రత్తలను తెలియజేశారు. ఎల్లప్పుడు సిలిండర్‌ను నిటారుగా ఉంచాలని, గ్యాస్ స్టవ్‌కు సిలిండర్‌కు కనీసం ఆరు అంగుళాలు ఎత్తున స్థిరమైన ఉపరితలంపై ఉంచాలన్నారు. వంట గదిలో గ్యాస్ సిలిండర్ కాకుండా మంట అంటుకునే ఏది ఉండరాదన్నారు. గ్యాస్ స్టవ్‌ను ఆన్ చేసే ముందు అగ్గిపుల్ల వెలిగించాలన్నారు. వంట చేసే సమయంలో సెల్ ఫోన్ మాట్లాడరాదన్నారు. వంట గదిలో ఉన్నప్పుడు ఎక్కువగా కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి సురక్ష హెూస్‌ని మార్చి కొత్తది వాడాలన్నారు. గాలిలో ఎల్పిజి వాసన వస్తే కరెంట్ స్విచ్‌లు వెయ్యకుండా లైటర్ ఆన్ చేయాలన్నారు. గ్యాస్ లీక్ అవుతుంటే సేఫ్టీ క్యాప్ పెట్టి సిలిండర్‌ను ఆరు బయట పెట్టి వెంటనే డిస్ట్రిబూటర్ కు సమాచారం ఇవ్వాలన్నారు. వీటితోపాటు మరికొన్ని మెలకువలు పాటిస్తే ఎల్పిజి ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ నాగేంద్ర, శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చంద్రశేఖర్ నాయక్

ఘనంగా ప్రపంచ దోమల దినోత్సవం

ప్రజాశక్తి-పీలేరు

దోమ జీర్ణాశయం ప్రేవుల్లో మలేరియా పారసైట్ జీవి గుట్టువిప్పిన పరిశోధకుడు సర్ రోనాల్డ్ రాస్ అని దాంతో ఆగస్టు 20న ప్రపంచ దోమల దినోత్సవంగా జరుపు కుంటారని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శనివారం తలుపుల పిహెచ్‌సి పరిధిలోని ఒంటిల్లులో ఒకరోజు ముందుగా ప్రపంచ దోమల దినోత్సవాన్ని పాఠశాల విద్యార్థులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మలేరియా దోమల ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుందని అన్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు నివారణ చర్యలో భాగంగా, లార్వా నిర్మూలన, దోమ కాటు నుండి రక్షణ, వ్యాధుల నిర్ధారణ, సరైన చికిత్స, మొదలగు చర్యలతో దోమకాటు వ్యాదుల నియంత్రణ సాధ్యమని అన్నారు. దోమలు ప్రజారోగ్య వ్యవస్థకు ప్రధాన శత్రువులనే విషయం అందరం తెలుసుకుని, దోమల నియంత్రణకు మనందరం బాధ్యత వహిద్దామని ఆయన చెప్పారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, పల్లె వీదుల్లో అవగాహ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, సిహెచ్ఒ నాగముత్యం, వెంకటరత్నం, ధరణి, ఆశ కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందరెడ్డి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండలం మద్దినాయునిపల్లి పంచాయతి, బిస్సయ్యగారిపల్లికి చెందిన బిసయ్యగారి ఆనందరెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ వారి తరపున రోజువారీ కూలీగా పని చేస్తున్నడు. అయితే గురువారం విద్యుత్ స్తంభం ఎక్కి క్రాసారాలు బిగిస్తుండగా స్తంభం విరిగి పైనుంచి పడి కాలు విరిగింది. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు తమ సొంత ఖర్చులతో మదనపల్లి లోనీ ఓ హాస్పిటల్ నందు చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఈ విషయం మద్దినాయుని పల్లి మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, సివి రెడ్డి, పారిశ్రామికవేత్త దాసిరపల్లి జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ఆస్పత్రికి మాజీ సర్పంచ్ మస్తాన్ రెడ్డి, మార్కిరి ఆంజనేయ రెడ్డి సివిరెడ్డిలతో కలిసి వెళ్లి ఆనంద్ రెడ్డిని పరామర్శించి వైద్య ఖర్చులకు పదివేల రూపాయలను అందజేశారు.

వృద్ధుడికి మందులు అందజేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో నివాసముంటున్న 102 సంవత్సరాల వయస్సు కలిగిన శతాదిక వృద్ధుడు వెంకటరమణను సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ దంపతులు పరామర్శించారు. శనివారం వారికి అందిన సమాచారం మేరకు వయో భారంతో మంచానికే పరిమితమైన ఆటో డ్రైవర్ శ్రీరాములు తండ్రి వెంకటరమణ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అయన కావలసినవి అందించి తండ్రిని జాగ్రత్తగా చూసుకోమని అయన కొడుకుకి చెప్పారు.ఆటో డ్రైవరుగా జీవనం సాగిస్తున్న కన్న తండ్రి ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ,అన్ని విధాలుగా చూసుకొంటున్న వృద్ధుడి కొడుకు, కోడలిని అభినందించారు. కన్న తండ్రిని కాపాడుకోవడానికి పేదరికం అడ్డురాదని,మానవత్వం చాటుతూ శత సంవత్సరాలు నిండి మంచానికే పరిమతమైన తండ్రిని కంటికి రెప్పలా కాపాడుకొంటూ ఆదర్శంగా నిలిచారాని కొనియాడారు.అభివృద్ధికి కావాల్సిన ఎనర్జీ డ్రింక్స్, మందులను అందజేశారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : జడ్జి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు చదువుతోపాటు సామాజిక బాధ్యతలు కూడా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల నందు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 14 ఏళ్లలోపు పిల్లలు నిర్బంధ విద్య హక్కు చట్టం అమలుకు సహకరించాలన్నారు. విద్యార్థులు బోధనలో వినడమే కాకుండా వాటిని ఆచరణలో కూడా పెట్టాలన్నారు. అనవసర విషయాలను పక్కనపెట్టి చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, వారు ఎంచుకున్న రంగంపై దృష్టి పెట్టాలని సూచించారు. జన్మనిచ్చి, పోషించి పెద్దవారిని చేసిన తల్లిదండ్రులను మంచిగా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజులత, కరస్పాండెంట్ ఆర్ గురు ప్రసాద్, ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందరెడ్డికి సాయం చేస్తున్న దాతలు

మాట్లాడుతున్న జడ్జి కరుణ్‌కుమార్

మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- న్యాయమూర్తి శ్రీనివాసులు నాయక్

ప్రజాశక్తి-పీలేరు

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పీలేరు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం స్థానిక న్యాయ స్థానంలో న్యాయమూర్తి న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సెప్టెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదారులు, ఎంఇఒపి, ఇతర పాత, కొత్త కేసులు అధిక సంఖ్యలో రాజీమార్గంలో పరిష్కారం చేసుకునేలా కచ్చిదారులకు అవకాశం కల్పించాలని తెలియజేశారు. రాజీమార్గమే రాజ మార్గమని వారికి తెలియజేస్తూ, లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కార మయ్యేందుకు తోడ్పడాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎపిపి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌ఎండి అన్సారి, న్యాయవాదులు భవానీ శంకర, షౌకత్ అలీ, వెంకటరమణారెడ్డి, సివి రెడ్డి, దినకర్, ప్రసాద్, రవీంద్రనాథ్ రెడ్డి, వజ్రాల మునార్ బీ, సుమలత, రాణి, కోర్టు సిబ్బంది మస్తాన్, నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు.

బిసిల అభ్యున్నతికి పాటుపడుతా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బిసి కులాల అభ్యున్నతికి తాను కృషి చేస్తానని ఎపి బిసి చైతన్య సమితి ఎన్నారై అధ్యక్షులు తురక వెంకట సుబ్బయ్య వెల్లడించారు. పట్టణంలోని డిఆర్ఎల్ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2010 నుంచి ఉమ్మడి రాష్ట్రంలో తన వడియ రాజుల కులంలోని పేదలకు వడియ రాజుల సంఘం ఎన్నారై అధ్యక్షునిగా అనేక విధాలుగా ఆదుకోవడం జరిగిందన్నారు. తనపై ఎన్ని కుట్రలు పన్నినా వాటిని ఛేదించి ఎపి బిసి చైతన్య సమితి ఎన్నారై అధ్యక్షునిగా, పెనగలూరు వడియ రాజుల సంఘం అధ్యక్షునిగా సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సొంత మండలమైన పెనగలూరుకు తన చేతనైన సహాయం చేసి తనను తాను నిరూపించుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. 2024 నుంచి బిసిలలోని పేద పిల్లలు చదువుకోవడం కోసం ఆర్థిక సహాయం చేయనున్నట్టు తెలిపారు. ఎపి బిసి చైతన్య సమితిలో బిసి కులానికి చెందిన ప్రతి ఒక్కరూ ఉన్నారని తెలిపారు. వారిని ఆదుకునేందుకు తాను సంఘం అధ్యక్షుని హోదాలోనే కాకుండా వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని తెలియజేశారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

నివాసముంటున్న ఇంటిని కూలగొట్టారు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తాము 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇంటిని కొందరు జెసిబితో పడగొట్టేశారని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరుల సమావేశంలో శివాజీ నగర్‌కు చెందిన సుబ్రమణ్యాచారి, సుప్రజ దంపతులు మాట్లాడుతూ కందుకూరి వెంకటరమణ ఆచారి పేరున ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందన్నారు. బండమీదకమ్మపల్లి గ్రామం సర్వేనెం 371/2లో ప్లాటు నెం.65రు ఎ.0-21/2 సెంట్లు గల ఖాళీ జాగా, ఇల్లు వారు మంజూరు చేసారని అన్నారు. సదరు ఇల్లు తన తండ్రి గారి మరణానంతరం వారసత్వ రీత్యా వారికి సంక్రమించిన పట్టా నెం.బి2/5705/83రుగా నమోదు కాబడినది. సదరు ఇల్లును కర్ణాటక రాష్ట్రం మైసూర్ స్థిర నివాసముండే జయమ్మ తమ ఇంటి నకిలీ పట్టా సృష్టించి మా ఇంటిని నిమ్మనపల్లికి చెందిన ఎస్.రహీం సాబ్ కుమారుడు ఎస్.యాసీన్ బాషాకు రూ.15 లక్షలకు విక్రయించి కర్ణాటక రాష్ట్రం మైసూర్ సిటీకి పారిపోయినదన్నారు. 01.05.2023వ తేదీన పట్ట పగలు ఎస్.యాసీన్ బాషా, ఇతని భార్య ఇద్దరు కలిసి మా ఇంటి తాళాలు పట్ట పగలు గొడుతుంటగా నేను విడియోను తీస్తు వుండగా అక్రమంగా దౌర్జన్యంగా నా ఇంటికి తాళం చేసుకొని ఆక్రమించినారన్నారు. తాము ఆర్‌డిఒను కలిసి సమస్యను విన్నవించుకోగా మా పట్టాను పరిశీలించి మాదే అని తేల్చి చెప్పారన్నారు. అప్పుడు వెళ్లిపోయి యాసీన్ బాషా తిరిగి తమ ఇంటిని పడగొట్టడానికి వచ్చారన్నారు. దీనిపై వీఆర్వో విశ్వనాథ్‌కు ఫిర్యాదు చేయగా కబ్జాదారులకు వత్తాసు పలుకుతూ తన భార్యను దుర్భాషలాడారన్నారు. ఆరోగ్యం సరిగా లేని చంటి పిల్లలతో తాము రోడ్డున పడుతున్నామని తమకు న్యాయం చేయాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ లోకేష్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం రాత్రి మర్రి మాకుల పల్లెలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కె.జ్యోతి సమక్షంలో గ్రామస్తులతో చర్చించారు. పోలీసులంటే భయపడాల్సిన అవసరం లేదని న్యాయం కోసం బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని గుర్తించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఉంటే గ్రామ మహిళా పోలీసుల ద్వారా సమాచారం అందివ్వాలన్నారు. గ్రామాలలో అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలంటే పిల్లల చదువులపై దృష్టి పెట్టాలన్నారు పాఠశాలలకు కళాశాలలు వెళ్లే పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపి మంచి నడవడికతో చదువుకునే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్ శంకర్ ,పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పక్కా గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రభుత్వం చేపట్టిన జగనన్న కాలనీలో లబ్ధిదారులు పక్కా గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని తహశీల్దార్ శ్రీనివాసులు ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. శనివారం మోడల్ స్కూల్ వద్ద, సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలను సందర్శించారు. లబ్ధిదారులతో చర్చించారు. ఇంటి నిర్మాణాలను పూర్తిచేసిన లబ్ధిదారులను అభినందించారు. లబ్ధిదారులు పట్టాలను పరిశీలించారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు వారికి కేటాయించిన స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలన్నారు. పట్టాలు పొంది స్థలం చూపని కొందరి లబ్ధిదారులతో చర్చించారు. వారికి త్వరగా స్థలాలను చూపాలని ఆర్ఐ రవి, హౌసింగ్ ఎఇ సుజాత, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు చొరవచూపాలన్నారు. ఎక్కడైనా ఆరోపణలు వచ్చిన సంబంధిత ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వీరి వెంట నాయకులు శ్రీనివాసులు, రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శులు రమణ, సోమశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలిస్తున్న అధికారులు